క్లుప్తంగా

అన్నదానం


అచ్చంపేటలోని అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న సునీల్, దొరబాబు తదితరులు

సామర్లకోట: మండల పరిధిలోని శ్రీలక్ష్మీనారాయణస్వామి కల్యాణ ఉత్సవాలు ముగింపు సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కాకినాడ లోక్‌సభ స్థానం అభ్యర్థి చలమలశెట్టి సునీల్, పెద్దాపురం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. స్వామి వారిని దర్శించుకొని పూజలు చేశారు. అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వీరంరెడ్డి చినబాబు, పెద్దాపురం మున్సిపల్ వైస్‌చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు వీరంరెడ్డి నాని, గ్రామ పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

6న రాజశేఖరస్వామి కల్యాణం

కొత్తపల్లి: స్థానిక బాలాత్రిపుర సుందరి సమేత రాజశేఖరస్వామివారి కల్యాణం ఈ నెల 6వ తేదీన నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు శర్మ, సుబ్రహ్మణ్యం ఆదివారం తెలిపారు. స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా ప్రతిరోజు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. 6న తేదీ ఉదయం గ్రామోత్సవం, రాత్రి 7 గంటలకు స్వామివరి కల్యాణం, 7న స్వామివారికి లలితా పారాయణ, ఆలయం వద్ద ముగ్గుల పోటీలు, 8న మహాశివరాత్రిని పురస్కరించుకుని స్వామివారికి పంచామృత అభిషేకాలు, లలితా పారాయణ, రాత్రికి స్వామివారి ఆలయం వద్ద దీపోత్సవం, 10న రథోత్సవం, స్వామివారి తీర్థం, కోలాటం, 11న శ్రీపుష్పయాగంతో కల్యాణ మహోత్సవాలు ముగుస్తాయని వివరించారు. స్వామివారి కల్యాణోత్సవాల్లో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సత్రం సేవలను వినియోగించుకోవాలి


విద్యార్థులకు స్కాలర్ షిప్పులు అందజేస్తున్న కృష్ణ తదితరులు

పెద్దాపురం: స్థానిక అల్లక్కి వెంకట్రామయ్య సత్రం సేవలను ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సత్రం వంశపారంపర్య ధర్మకర్త అల్లక్కి కృష్ణ అన్నారు. స్థానిక రామారావుపేట సత్రంలో ఆదివారం దాత ఆశయ సాధనలో భాగంగా 40 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.ఐదు వేల చొప్పున రెండు లక్షల రూపాయల చెక్కులను ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సత్రం ఈఓ కాట్నం జగన్మోహన శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ధర్మకర్త కృష్ణ మాట్లాడుతూ సత్రం వ్యవస్థాపకులు వెంకట్రామయ్య సేవలను కొనియాడారు. బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు చర్ల రామారావు, రావులపర్తి విజయ్, విద్యార్థులు పాల్గొన్నారు.

గోదావరి యాసకు జీవం పోసిన పసలపూడి కథలు

బోట్‌క్లబ్: గోదావరి యాసకు పసలపూడి కథలు జీవం పోశాయని ఆదిత్య విద్యాసంస్థల అధినేత నల్లమిల్లి శేషారెడ్డి అన్నారు. స్థానిక ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల్లో ఆదివారం కె.రామచంద్రారెడ్డి రచించిన వంశీ మా పసలపూడి కథల పరిశోధన గ్రంథం పరిచయ సభ జరిగింది. శేషారెడ్డి మాట్లాడుతూ పసలపూడి కథలు గోదావరి జిల్లాల యాసనూ, మానవీయ విలువలను సమర్థవంతంగా రచయిత వంశీ రచించారన్నారు. కవి, చారిత్రక పరిశోధకులు ర్యాలి ప్రసాద్ మాట్లాడుతూ వంశీ కథల్లో గోదావరి జిల్లాల జీవన విధానాన్ని, మాండలిక భాషా సౌందర్యాన్ని వివరించారన్నారు. కవి,రచయిత అద్దేపల్లి ప్రభు మాట్లాడుతూ వంశీ కథలకు రామచంద్రారెడ్డి పరిశోధన మరింత గౌరవాన్ని తెచ్చిందన్నారు. సాహితీవేత్త పి.ఎస్ ప్రకాశరావు రచయిత పరిశోధనలోని అంశాలను వివరించి అభినందనలు తెలిపారు. పుస్తక ప్రచురణ కర్త సానా వెంకట్రావు మాట్లాడుతూ రామచంద్రారెడ్డితో గల స్నేహాన్ని వివరించారు. అనంతరం రామచంద్రారెడ్డిని సత్కరించారు. కొండూరు రామరాజు, మార్ని జానకిరామ చౌదరి, గొడవర్తి సత్యమూర్తి, కొరుప్రోలు గౌరీనాయుడు, మాకినీడి సూర్యభాస్కర్ పాల్గొన్నారు.

విలయత్ అలీ సేవలు మరువరానివి

కాకినాడ సిటీ: సమాచార పౌర సంబంధాల శాఖలో సుదీర్ఘకాలం వివిధ హోదాల్లో పని చేసి డివిజనల్ పౌర సంబంధాల అధికారిగా ఇటీవల పదవీ విరమణ చేసిన ఎండీ విలాయత్ అలీ ఆత్మీయ వీడ్కోలు సభ ఆదివారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయం, కాకినాడలో నిర్వహించారు. ఈ సన్మాన కార్యక్రమానికి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా డీపీఆర్వో కె లక్ష్మీనారాయణ, తూర్పుగోదావరిజిల్లా డీపీఆర్వో ఐ కాశయ్య హాజరై ఎండీ విలాయిత్ అలీ దంపతులనుసత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు.

భీమన్న కల్యాణానికి ఏర్పాట్లు

- సిద్ధమవుతున్న క్యూ లు, చలువ పందిర్లు
- 6 నుంచి 11 వరకు మహాశివరాత్రి ఉత్సవాలు


సామర్లకోటలోని బాలాత్రిపుర సుందరి సమేత కుమారరామ భీమేశ్వరస్వామి ఆలయం


ఆలయం వద్ద లైటింగ్ ఏర్పాటు చేస్తున్న కార్మికులు

సామర్లకోట: స్థానిక బాలాత్రిపుర సుందరి సమేత కుమారరామ భీమేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లు జోరుగా జరుగుతున్నాయి. ఈ క్షేత్రంలోని పరమేశ్వరుడు యోగలింగంగా సాక్షాత్కరిస్తారు. ఇక్కడ లింగాన్ని స్వయంగా కుమరస్వామి ప్రతిష్టించడంచే కుమారరామ భీమేశ్వరస్వామిగా పిలుస్తారు. ఈ నెల 6 నుంచి 11వ తేదీ వరకు ఆలయం వద్ద మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. 6వ తేదీ ఉదయం విఘ్నేశ్వర పూజ, మధ్యాహ్నం గ్రామోత్సవం, రాత్రి స్వామి వారి కల్యాణం జరుగుతుంది. 7వ తేదీ స్వామి వారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు, 8వ తేదీ మహాశివరాత్రి సందర్భంగా తెల్లవారు జామున ఒంటి గంటకు ఆలయం తెరిచి భక్తుల దర్శనానికి అనుమతి ఇస్తారు. పిఠాపురం మహా రాజా గోత్రనామాలతో పూజలు ప్రారంభిస్తారు. 9వ తేదీ ఉదయం పూజలు, మధ్యాహ్నం రథోత్సవం నిర్వహిస్తారు. 10వ తేదీ ఉదయం త్రిశూల స్నానం, తీర్థపు సేవ, 11వ తేదీ రాత్రి శ్రీపుష్పయాగోత్సవం జరిపిస్తారు.

స్వామి వారి కల్యాణం, శివరాత్రి ఏర్పాట్ల జోరు

మహాశివరాత్రి, స్వామివారి కల్యాణాన్ని పురస్కరించుకొని ఆలయంలో ఏర్పాట్లు చేస్తున్నారు. మహాశివరాత్రిని పురస్కరించుకొని లక్షకు మించి భక్తులు వచ్చే అవకాశం ఉన్నదని అధికారులు అంచనాలు వేస్తున్నారు. ఈ మేరకు భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉచిత దర్శనంతో పాటు రూ.20, రూ.50, రూ.100 దర్శనాల క్యూ లు ఏర్పాటు చేస్తున్నారు. వీఐపీలకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. ఆలయ కొనేరు మీదుగా ఉచిత దర్శనం క్యూ లు ఏర్పాటు చేశారు. ఆలయ ప్రధాన ద్వారం నుంచి రూ.20 క్యూ ను ధ్వజస్తంభం మీదుగాను, రూ.50, 100 క్యూ లు ఆలయ ద్వారం మీదుగాను ఏర్పాటు చేశారు. ఆలయంలో చలువ పందిర్లు వేశారు. ఆలయం అంతా విద్యుత్తు దీపాలంకరణ పనులు జోరుగా జరుగుతున్నాయి. మహాశివరాత్రి పర్వదినం రోజున ఆలయ కోనేరులో వేలాది మంది భక్తులు పుణ్య స్నానాలు చేసే అవకాశం ఉన్న కారణంగా కోనేరును కొత్త నీటితో నింపుతున్నారు.

ఉపవాసంతో మంచి ఫలితాలు



శివరాత్రి పర్వదినం రోజున ఉపవాస దీక్షతో ప్రదర్శన, జాగరణ చేయడం ద్వారా ముక్తి, మోక్షం లభిస్తుంది. త్రయోదశితో మహాశివరాత్రి రావడంతో విశిష్టత ఉంది. మహాశివరాత్రి రోజున శివనామ స్మరణ చేయడం ద్వారా మంచి ఫలితాలు లభిస్తాయి. పంచారామ క్షేత్రంలోని యోగలింగాన్ని పూజించడం ద్వారా మోక్షం కలుగుతుంది.

– వేమూరి సోమేశ్వరశర్మ, అభిషేక పండితులు, సామర్లకోట

గతంలో కంటే మెరుగ్గా..



మహాశివరాత్రి సందర్భంగా గతంలో కంటే మెరుగైన ఏర్పాట్లు చేస్తున్నాం. గోదావరి కాలువపై ఇనుప వంతెన, ఉచిత దర్శనం, రూ.20 దర్శనాల నిచ్చెనలకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేస్తున్నాం. స్వామి వారి కల్యాణం ప్రతి ఒక్కరూ తిలకించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నాం. కొనేరు వద్ద గజ ఈతగాళ్లను నియమిస్తు న్నాం. తాగునీరు, మజ్జిగ, పాలు, అల్పాహారం, భోజనాల సరఫరాకు సదుపాయాలు కల్పిస్తున్నాం.

– బళ్ల నీలకంఠం, ఆలయ ఈఓ, సామర్లకోట

కొనసాగుతున్న రైల్వే గేటు పనులు


సామర్లకోట రైల్వే గేటులో సాగుతున్న ట్రాకు మరమ్మతు పనులు

సామర్లకోట: స్థానిక ఎల్‌సీ 426 గేటులో ట్రాకు పనులు ఆదివారం కొనసాగాయి. గత నెల 28వ తేదీ నుంచి రైల్వే గేటులో ట్రాకు మరమ్మతు పనులు జరుగుతున్నాయి. ఈ మేరకు ఈ నెల ఆరవ తేదీ వరకు రైల్వే గేటును మూసి వేస్తున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించిన విషయం విదితమే. రైలు పట్టాలను పైకి లేపి కొత్త రాళ్లతో నింపడంతో పాటు ఆటోమెటిక్ సిగ్నల్ వ్యవస్థకు సంబంధించిన కేబుల్ ఏర్పాటు పనులు జరుగుతున్నాయని స్టేషన్ మేనేజరు ఎం.రమేష్ తెలిపారు. ఈ పనులను స్టేషన్ మేనేజరుతో పాటు ఏడీఈఎన్ శివప్రసాద్, సీనియర్ సెక్షన్ ఇంజినీర్ రవికాంత్, నారాయణరాజు పరిశీలించారు. వేగంగా నడిచే రైళ్ల కారణంగా ట్రాకు మరమ్మతులను ఎప్పటి కప్పుడు చేయవలసి ఉంటుందని వారు తెలిపారు.

పేదల ఆరోగ్యానికి భరోసా

కాకినాడ ఎంపీ వంగా గీత


లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్‌లు పంపిణీ చేస్తున్న కాకినాడ ఎంపీ వంగా గీత

పిఠాపురం: పేదల సంపూర్ణ ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా కల్పిస్తోందని కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత అన్నారు. పిఠాపురంలోని క్యాంపు కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు ఆదివారం ఆమె సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిఠాపురం నియోజకవర్గంలో 13 కుటుంబాలకు చెందిన లబ్ధిదారులకు రూ.16 లక్షల విలువైన సీఎం సహాయ నిధి చెక్‌లను పంపిణీ చేశామన్నారు. వ్యాధుల బారిన పడి వైద్యం చేయించుకోలేక నిస్సాహాయంగా ఉన్న అభాగ్యులను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్థికంగా ఆదుకుంటున్నారన్నారు. ప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు, ఆరోగ్య శ్రీ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లబ్ధిదారులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

రైతులకు అందుబాటులో వ్యవసాయ కళాశాల విద్యార్థులు


విద్యార్థుల రికార్డులు పరిశీలిస్తున్న డీన్ శ్యామ్‌రాజ్ నాయక్

పెద్దాపురం: గ్రామీణ ప్రాంత రైతులకు వ్యవసాయ సూచనలు చేసేందుకు రైతులకు కళాశాల విద్యార్థులు అందుబాటులో ఉంటారని రాజమహేంద్రవరం వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సీహెచ్ శ్యామ్‌రాజ్ నాయక్ అన్నారు. మండలంలోని వడ్లమూరు, జి.రాగంపేట, జె.తిమ్మాపురం గ్రామాల్లో ఉన్న కళాశాల విద్యార్థుల వ్యవసాయ సేవలపై ఆదివారం ఆయన ఆరా తీశారు. ఈ సందర్భంగా కళాశాల డీన్ శ్యామ్‌రాజ్ నాయక్ మాట్లాడుతూ గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా కళాశాల విద్యార్థులు నాలుగు నెలల పాటు కళాశాల విద్యార్థులు రైతులకు అందుబాటులో ఉండి సేవలందిస్తారన్నారు. సాగుకు సంబంధించిన మెళకువలను రైతుల వద్ద నుంచి నేర్చుకోవడమే గాకుండా వారికి అవసరమైన సూచనలు, సలహాలను వ్యవసాయ శాఖ అధికారులు, కళాశాల అధ్యాపకుల నుంచి తెలుసుకుని రైతులకు మెరుగైన వ్యవసాయ పద్ధతులపై సూచనలు, సలహాలు ఇస్తారన్నారు. అనంతరం విద్యార్థులకు పలు సూచనలు, సలహాలిచ్చారు.

తీరంలో పర్యాటకుల సందడి


ఉప్పాడ సాగరతీరంలో సందడి చేస్తున్న పర్యాటకులు

కొత్తపల్లి: ఉప్పాడ సాగరతీరం ఆదివారం పర్యాటకులతో కళకళలాడింది. సెలవు రోజు కావడంతో నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి సందర్శకులు బీచ్‌కు తరలివచ్చారు. ఉప్పాడ తీరంలో కేరింతలు కొట్టారు. యువత ఆటపాటలతో సందడి చేశారు. తీర ప్రాంతంలో నిలువ నీడ లేకపోవడంతో పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

నేడు వైఎస్సార్ సీపీలో భారీ చేరికలు

పెద్దాపురం: మండలంలోని పులిమేరు గ్రామంలో సోమవారం గ్రామానికి చెందిన పలువురు టీడీపీ, జనసేన నాయకులు భారీ స్థాయిలో వైఎస్సార్ సీపీ పార్టీలో చేరనున్నట్లు గ్రామ మాజీ సర్పంచ్ తుమ్మల సూర్యకృష్ణమూర్తి తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ప్రజా సంక్షేమ పథకాలను నేరుగా ప్రజలకు అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాలనపై ఉన్న ఆసక్తితో పార్టీలో చేరనున్నట్లు ఆయన తెలిపారు. గ్రామ మాజీ సర్పంచ్ తుమ్మల అజ్ఞావతి, సూర్యకృష్ణమూర్తిలతో పాటు గ్రామానికి చెందిన టీడీపీ, జనసేన పార్టీల నుంచి సుమారు 200 మంది వైఎస్సార్ సీపీ కాకినాడ పార్లమెంట్ కో–ఆర్డినేటర్ చలమలశెట్టి సునీల్, పెద్దాపురం నియోజకవర్గ కో–ఆర్డినేటర్ దవులూరి దొరబాబుల సమక్షంలో పార్టీ తీర్థం తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు.

సర్పవరం ఆలయానికి పోటెత్తిన భక్తులు


సర్పవరం ఆలయంలో భావనారాయణస్వామిని దర్శించుకుంటున్న కురసాల కల్యాణ్‌కృష్ణ


ఆలయ ప్రాంగణంలో స్వామివారికి పొంగలి తయారు చేస్తున్న మహిళలు

కాకినాడ రూరల్: మాఘమాసం సందర్భంగా మండలంలోని సర్పవరం ఆలయానికి భక్తులు పోటెత్తారు. రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణస్వామి ఆలయం వద్ద మాఘ నాలుగో ఆదివారం సందర్భంగా వేలాదిగా తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు ఆవు పిడకలతో పాలు పొంగించి పొంగలి తయారు చేసి సూర్య భగవానుడికి నైవేద్యంగా సమర్పించారు. దేవదాయ ధర్మదాయ శాఖ అధీనంలోని ఈ ఆలయానికి విచ్చేసే భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఆలయ ఈఓ భీమేశ్వరరావు, ఆలయ కమిటీ చైర్మన్ పుల్ల నారాయణరావు, సభ్యులు, గ్రామ సర్పంచ్ శీలం నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ పుల్ల ప్రభాకరరావు, గ్రామ నాయకులు పల్ల చందు, కోటేశ్వరరావు ఏర్పాట్లు చేశారు. గ్రామస్తుల సహకారంతో వచ్చిన భక్తులకు భారీగా అన్నదానం నిర్వహించారు. స్వామి వారిని సినీ దర్శకుడు, ఎమ్మెల్యే కన్నబాబు సోదరుడు కురసాల కల్యాణ్ కృష్ణ దర్శించుకున్నారు.

పోలియో రహిత రాష్ట్రమే లక్ష్యం

- కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత
- పల్స్ పోలియో విజయవంతం
- పలు గ్రామాల్లో చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన ప్రజాప్రతినిధులు


పిఠాపురంలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న కాకినాడ ఎంపీ వంగా గీత


చేబ్రోలులో పోలియో చుక్కలు వేస్తున్న జెడ్పీటీసీ నాగ లోవరాజు


పోలియో చుక్కలు వేస్తున్న మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్


కొత్తపల్లి పీహెచ్‌సీలో పల్స్ పోలియోపై ఆరా తీస్తున్న జిల్లా అధికారి నాయక్

పిఠాపురం: ఆంధ్రప్రదేశ్‌ను పోలియో రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత అన్నారు. పిఠాపురం మున్సిపల్ కార్యాలయంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆదివారం ఆమె ప్రారంభించారు. పలువురు చిన్నారులకు ఆమె పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదేళ్లలోపు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు. పోలియో రహిత సమాజం కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులో జెడ్పీటీసీ వులవకాయల నాగ లోవరాజు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. గొల్లప్రోలు నగర పంచాయతీ పరిధిలో తహసీల్దార్ ఉదయభాస్కర్, మున్సిపల్ కమిషనర్ రవి కుమార్ పల్స్ పోలియోను పర్యవేక్షించారు. పలువురు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.

పోలియో రహిత సమాజమే లక్ష్యం

కొత్తపల్లి: పోలియో రహిత సమాజమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం పల్స్ పోలియోను ఆయన ప్రారంభించారు. చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పల్స్ పోలియోలో వైద్య సిబ్బంది పని తీరు భేష్ అని కొనియాడారు. ఐదేళ్ల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయాలని సూచించారు. కొత్తపల్లి, నాగులాపల్లి, కొమరగిరి పీహెచ్‌సీల వైద్యాధికారులు సుష్మ, సౌజన్య, రాజ్‌కుమార్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 97శాతం మందికి పోలియో చుక్కలు వేసినట్టు తెలిపారు. కొత్తపల్లి పీహెచ్‌సీ పరిధిలో 2,934 మందికి గాను 2,846 మందికి, నాగులాపల్లి పీహెచ్‌సీ పరిధిలో 2454 మందికి గాను 2282 మందికి, కొమరగిరి పీహెచ్‌సీ పరిధిలో 962 మందికి గాను 939 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్టు వివరించారు. సోమవారం వైద్య సిబ్బంది ఇంటింటా సర్వే చేసి మిగిలిన చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మాదిరెడ్డి దొరబాబు, కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, వాకతిప్ప, కుతుకుడుమిల్లి సర్పంచులు పాలాని దొరబాబు, కర్రి చిన్నారావు, ఎంపీటీసీ రాయుడు విష్ణు తదితరులు పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజం కావాలి

సామర్లకోట: పట్టణ పరిధిలోని ప్రతీ వార్డులోను, మండలంలోని ప్రతీ గ్రామంలోను ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం జోరుగా జరిగింది. మధ్యాహ్నం ఒంటి గంటకే 80 శాతం పూర్తి కావడంతో తల్లిదండ్రుల్లో పోలియో చుక్కలపై అవగాహన పెరిగిందని చెప్పవచ్చు. కోవిడ్ తరువాత పిల్లలకే వేయించే వివిధ వ్యాక్సిన్ల కోసం ప్రభుత్వ ఆస్పత్రులకు సకాలంలోతమ పిల్లలను తీసుకొని వస్తున్నారని వేట్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టరు వై శ్రీహిమవతి తెలిపారు. వేట్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన పోలియో కేంద్రాన్ని ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు ప్రారంభించారు. మండల పరిధిలోని 18 గ్రామాల్లో 6,851 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయించవలసి ఉండగా వారి కోసం 45 పోలియో కేంద్రాలను ఒక మొబైల్ టీము, నాలుగు సూపర్‌వైజరు టీములను ఏర్పాటు చేశామని డాక్టరు శ్రీహిమవతి చెప్పారు. సాయంత్రం ఐదు గంటలకు 6,112 మందికి పోలియో చుక్కలు వేసినట్లు ఆమె తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని 31 వార్డుల్లో 3,645 చిన్నారులకు పోలియో చుక్కలు వేయడానికి 36 కేంద్రాలు, రెండు మొబైల్ టీములు ఏర్పాటు చేశామని మున్సిపల్ కమిషనర్ జె.రామారావు తెలిపారు. అయోధ్యరామపురం అర్బన్ హెల్త్ సెంటర్‌లో పోలియో కేంద్రాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ ప్రారంభించి పోలియో చుక్కలు వేశారు. 24వ వార్డులో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ప్రారంభించారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఒకటో వార్డు కౌన్సిలర్ రెడ్డి లోవకుమారి పోలియో కేంద్రాన్ని ప్రారంభించి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. పట్టణ పరిధిలోని ఆయా వార్డులోని కౌన్సిలర్లు, గ్రామాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. పరదేశ్, భవ్యశ్రీ, శివప్రసాద్‌లు పోలియో కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

పోలియో రహిత సమాజ నిర్మాణానికి కృషి

పెద్దాపురం: పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతీ ఒక్కరం కృషి చేద్దామని పెద్దాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆదివారం పల్స్ పోలియో చుక్కల కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. కౌన్సిలర్లు విజ్జపు రాజశేఖర్, త్సలికి సత్య భాస్కర్, విడదాసరి రాజా, ఆరెళ్లి వీర్రాఘవులు, ఆయా వార్డుల కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రూరల్‌లో....

మండలంలోని 23 గ్రామాల పరిధిలోని కాండ్రకోట, పులిమేరు పీహెచ్‌సిల సిబ్బంది ఆయా గ్రామాల్లో చిన్నారులకు పోలియో చుక్కలు వేయించారు. కాండ్రకోట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన పోలియో చుక్కల కేంద్రంలో జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, ఎంపీటీసీ సభ్యుడు జాగు వీరభద్రరావు, సర్పంచ్ శ్రీనివాస్, వడ్లమూరులో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కంటే వీర్రాఘవరావు, పులిమేరులో తుమ్మల అచ్యుతరామయ్య చేతుల మీదుగా చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఆయా గ్రామాల్లో సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధుల చేతుల మీదుగా పోలియో చుక్కల కార్యక్రమాన్ని నిర్వహించారు.

పల్స్ పోలియోపై ఇంటింటా సర్వే

కొత్తపల్లి: పల్స్ పోలియోపై గ్రామాల్లోని వైద్య సిబ్బంది ఇంటింటా సర్వే చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి నాయక్ సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పల్స్ పోలియోను అదివారం ఆయన తనిఖీ చేశారు. పల్స్ పోలియోపై వైద్యాధికారి సుష్మను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీలో ఓపి, పలు రికార్డులను పరిశీలించారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు.


గొల్లప్రోలులో పోలియో చుక్కలు వేస్తున్న మున్సిపల్ కమిషనర్ రవి కుమార్


కొత్తపల్లి పీహెచ్‌సీలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న వైస్ ఎంపీపీ మాదిరెడ్డి దొరబాబు


చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు సుదర్శన్


వేట్లపాలెం పీహెచ్‌సీలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ సత్తిబాబు


సామర్లకోట అర్బన్ హెల్త్ సెంటర్‌లో పోలియో చుక్కలు వేసిన చైర్‌పర్సన్ అరుణ